కె. బి. కృష్ణ

# చీకటిలో చిఱుదివ్వె

అడుక్కు తినడంలో అనేక రకాలు. ఇళ్ళ వెంబడి తిరిగి అడుక్కోవడం, ఏదో ట్రస్ట్-కి సంబంధించిన పుస్తకం తీసుకొని దానికి చందాలు వసూలు చేస్తున్నామని తిరగడం, లేదా స్వాములవారి మఠం కట్టించడానికి చందాలు అని, లేదా మొక్కు తీర్చుకోడానికి తిరుపతి వెళుతున్నామని, ఇలా ఎన్నోరకాలు. ఇందులో నిజానిజాలు తెలియవు మనకు. వీటన్నిటి కంటె నాకు ఇంటింటికి తిరిగి అడుక్కు తినడమే మేలనిపిస్తుంది. ఎందుకంటే వాళ్ళు మనల్ని మోసం చెయ్యటం లేదు కాబట్టి.

ఆరోజు జీతాలరోజు. ఆఫీసులో అందరూ ఆ నెలకు వచ్చే జీతంలో ఎంత మిగులుతుంది ? జీతంలో మిగలకపోతే ఏంచేయాలి ? మిగిలితే బ్యాంకులో ఎంత వేసుకోవాలి ? అన్నది చర్చించుకుంటున్నారు. ఈలోగా ఒక బైండు పుస్తకము తీసుకొని, తెల్లని, మాసిన బట్టలు వేసుకున్న ఒక యువకుడు మా ఆఫీసులో అడుగుపెట్టేడు. అందరి దగ్గరకు వెళ్ళి దీనంగా ఏదో అడిగి వ్రాయించుకుంటున్నాడు. బహుశః చందాలు అయివుంటాయి అనుకున్నాను. ఎందుకంటే మాకు జీతాలు వచ్చేసరికి ఇలాంటివారు లైనులో నుంచుంటారు. అసలే చాలీచాలని జీతాలతో సతమతమవుతున్న మాకు ఇటువంటి సమస్యలు కొన్ని.

ఆ యువకుడు నా దగ్గరకు వచ్చేడు. బైండు పుస్తకము నా ముందు పెట్టేడు.

" ఏమిటి " అన్నాను,

" సార్ మాది చాల పేదకుటుంబం. నేను కుటుంబానికి పెద్దవాణ్ణి. పదోతరగతి చదువుతున్నాను. నాకు చదువుకు డబ్బు కావాలి.... నా చదువు అయిపోతే ఎలాగో నా కుటుంబాన్ని పోషించుకుంటాను.... " ఏదో చెప్తున్నాడు. బైండులో మొదటి పేజీలో ఆ గ్రామానికి సంబంధించిన అధికారి ఈ యువకుడి గురించి వ్రాసి, ఎవరికితోచిన సహాయం వారు చెయ్యవలసిందని, సంతకం చేసి ముద్ర వేశాడు. చందాలు వేసి వున్నాయి. బాగానే వుంది.

నేను చందా వేయదల్చుకోలేదు.

" సాయంకాలం నాతో పాటుగా మా ఇంటికిరా. నీకు నేను తగువిధంగా సహాయం చేస్తాను, " అనుమానంగా నన్ను చూడసాగేడు అతను.

సాయంకాలం అతన్ని వెతికి పట్టుకొని ఇంటికి తీసుకు వెళ్ళేను. వరండాలో కూర్చోబెట్టి ఇంట్లోకి వచ్చి నాతోపాటు కాఫీ ఇచ్చేను. నేను బయటకు రాగానే లేచి నిలబడబోయాడు .

" కూర్చోవయ్యా ఫర్వాలేదు " అన్నాను

" నేను రాత్రికి వెళ్ళిపోతాను సార్. ఇంటిదగ్గర ఎదురు చూస్తుంటారు " అతని మాటల్లో ఆతృత గోచరిస్తోంది.

" నీ పేరు ? "

" రవీంద్ర, మా యింటిదగ్గర నన్ను రవి అని పిలుస్తుంటారు. "

" నేను అడిగే ప్రశ్నకు నిజమైన సమాధానం కావాలి చెప్తావా ?"

" అడగండి సార్ "

" నువ్వు నిజంగా 10వ క్లాసు చదువు తున్నావా ? నీకు నిజంగా నీ మీద ఆధారపడ్డ కుటుంబం వుందా ? " అన్నాను. తల వంచుకొని కూర్చున్నాడు.

కొద్దిసేపు మౌనం.

" ఏమోయ్ నిజం చెప్పు. నేను నీకు నిజంగా ఉపకారం చెయ్యాలనే ఉద్దేశ్యంతోనే అడుగుతున్నాను. "

రవీంద్ర తల ఎత్తేడు. అతనికళ్ళు వర్షించడానికి సిద్ధంగా వున్నాయి. అతని బుగ్గల మీదుగా కన్నీటి ధారలు. నా మనస్సు కరిగిపోయింది.

" సార్ నన్ను క్షమించండి. నేను టెన్త్ చదవడంలేదు. నామీద కుటుంబం ఆధారపడ్డమాట మాత్రం నిజమే. పదవ తరగతి ప్యాసయి రెండేళ్ళు అయింది. నాకు తండ్రిలేరు నా తల్లితో కలిసి మొత్తం ఏడుగురం. మా నాన్నగారు ఏదో వ్యాపారం చేస్తూ ఆ వ్యాపారం బాగుండగా, ముందుచూపు లేకుండా కుటుంబాన్ని పెంచేరు. వ్యాపారంలో దివాళా తీసి చనిపోయారు. ఆ నేరానికి నేను ఇప్పుడు శిక్ష అనుభవిస్తున్నాను

మా వూరు— " అతను ఏమిటేమిటో చెప్తున్నాడు. నాకు మనసంతా వికలం అయిపోయింది.

" రవీంద్రా అడుక్కుతినడంలో నువ్వు ఒకమెట్టు పైకి ఎక్కి రాయల్‌గా అడుక్కుతింటున్నావు. అందుకు నిన్ను ఏమీ అననుకాని ఇలా ఎన్ని సంవత్సరాలు పదో తరగతి అని చెప్తావ్ ? తరువాత అయినా నువ్వు వక్రమార్గం పట్టక తప్పదు. అందుకని నేను ఒక మార్గం చెప్తాను అలా చెయ్యి రాత్రికి మా యింటిలో భోజనం చెయ్యి. ప్రొద్దున్నే నేను చెప్పిన పద్ధతి నచ్చకపోతే వెళ్ళిపోదువుగాని " అన్నాను

అతని ముఖంలో వింతకాంతి గోచరించింది. అది చూసి నా మనసు శాంతించింది.

రాత్రి అంతా ఆలోచించేను.

గ్రామీణ బ్యాంక్‌లో మేనేజర్ నాకు ప్రియమైన స్నేహితుడు. అతనితో చెప్పి, ఈ యువకుడికి ఏదైనా సహాయం చెయ్యాలి అని నిర్ణయం చేసుకున్నాను.

మరునాడు ఉదయం ఈ విషయం రవీంద్రకు చెప్పేను. అతని సంతోషానికి అంతులేదు. నా కాళ్ళమీద పడబోయేడు. వారించేను.

బ్యాంకుకు వెళ్ళేము.

" కృష్ణా ఇతనికి నేను హామీ వుంటాను ఐదు వందలు అప్పు ఇవ్వాలి. ఇతనిచేత మా ఆఫీసు దగ్గర టీ స్టాల్ పెట్టిస్తాను " అన్నాను.

దానికి మేనేజర్ కృష్ణ " ఎవరు ఇతను ? నీకు ఎలా తెలుసు ? నిన్న పుస్తకం తీసుకొని చందాకి వచ్చేడు. నీ హామీ మీద అప్పు ఇస్తాననుకో, ఇలాంటి అనామకులకు అప్పు ఇప్పించి మువ్వ ఇబ్బందిలో పడతావేమోనని భయంగావుంది " అన్నాడు.

అప్పుడు రవీంద్ర మాటలకు మధ్యలో అడ్డువచ్చేడు.

" నేను అలాంటివాణ్ణి కాదు సార్. డబ్బు సార్ దగ్గరే ఉంటుంది. అవసరమైనప్పుడల్లా వారినే అడిగి తీసుకుంటాను " అతన్ని చెప్పకుండా వారించేడు మేనేజరు.

" నిరుద్యోగుల ఉపాధి పథకం " క్రింద రవీంద్రకు నా హామీమీద ఐదు వందలు అప్పు ఇచ్చారు గ్రామీణ బ్యాంక్‌లో.

మా ఆఫీసుకు దగ్గరగా, ఒకగది తడికెలతో కట్టించి టీ స్టాల్ ప్రారంభించేశాము. టీ స్టాల్‌లో మా ఆఫీసు వాళ్ళందరిచేత కాతాలు పెట్టించేను. అతని టీ స్టాల్ మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

రెండు నెలల్లో అతని తల్లినీ, తమ్ముళ్ళనూ చెల్లెళ్ళనూ తీసుకువచ్చేడు.

మా వూరిలో రవీంద్ర ఒక బిజీ టీ స్టాల్ యజమాని అయ్యేడు. బ్యాంకులో అప్పు తీర్చేశాడు. సేవింగ్స్ బ్యాంక్‌లో కాతా పెరిగింది.

గులాబి మొక్క కొమ్మ నాటి, అది చిగురించి మొగ్గలు వేసి, పూలు పూస్తే, ఆ కొమ్మ నాటిన వ్యక్తి ఎంత ఆనందిస్తాడో నా పరిస్థితి అలావుంది.

ఆఫీసుకు వెళ్తున్నాను ఆ రోజు.

"సార్" అటు చూసేను. రవీంద్ర. నన్ను పిలుస్తున్నాడు.

"ఏమిటోయ్?"

"రేపటికి టీ స్టాల్ పెట్టి సంవత్సరం అవుతుంది సార్. ఈ సందర్భంలో మిమ్మల్ని గౌరవించ దలచుకున్నాను. మరొక శుభవార్త. ఫ్రంట్స్ హోటల్ ప్రొప్రయిటర్‌గారి కుమార్తెని నాకు ఇస్తామన్నారు సార్. ఆయనకు ఒక్కగానొక్క కూతురుగదండి. ఆ హోటల్‌కి నన్ను మేనేజర్‌గా వేస్తానన్నారండి"

"ఏమిటోయ్. శుభవార్తలు వరుసగా చెప్తున్నావ్. నాకు ఉక్కిరి బిక్కిరి అవుతోంది. నన్ను గౌరవించడానికి కంగారు లేదు కాని—" నా మాటలు మధ్యలో ఆపి.

"మీరు తప్పక రావాలి సార్"

"సరే" అన్నాను.

మరునాడు—

నాకు నిలువెత్తు దండ వేశాడు. కాళ్ళు కడిగేడు. వెండి వెంకటేశ్వరస్వామి పటం ఇచ్చేడు. పాదాభివందనం చేశాడు. పాదాలమీద నుండి లేవడంలేదు రవీంద్ర.

"లే రవీంద్రా" అన్నాను.

తల ఎత్తేడు—

రవీంద్ర కళ్ళు నీటితో నిండి వున్నాయి. అయితే ఆ నీ
ఆనాటి కన్నీరు కాదు. అవి ఆనంద బాష్పాలు.

"సార్ నా చీకటి జీవితంలో వెలుగు చూపించారు సార్
మీరు కనుపించక పోతే నేను ఏమయిపోయేవాడినో" ఏదో చెప్తున్నాడు.

"రవీంద్రా-అంతా బాగానేవుంది నువ్వు పెళ్ళిచేసుకుంటానంటే
సంతోషించే వాళ్ళలో ప్రథముణ్ణి. అయితే నువ్వు పెళ్ళి అయ్యాక
దూరదృష్టితో ఇద్దరు పిల్లల్ని మాత్రమే కని సంతానం పెంచుకోకుండా
నీ తమ్ముళ్ళను, చెల్లెళ్ళను పైకి తీసుకురా. నీ తల్లిని సుఖపెట్టు.
నువ్వు ఉద్యోగంలేక అందరి దగ్గర యాచించేటప్పుడు ఈ దేశం నాకేమి
చ్చిందని బాధపడి వుంటావు. కాని చూడు ప్రభుత్వం ఏర్పాటుచేసిన
నిరుద్యోగుల స్వయం ఉపాధి పథకం క్రింద నీకు బ్యాంకు వారు ఋణం
ఇచ్చారు.

నీకు ప్రభుత్వం చేసిన ఈ ఉపకారానికి ప్రత్యుపకారంగా, జనా
పెంచకుండా ఇద్దరు పిల్లలతో తృప్తిపడి నీ జీవితాన్ని చక్కగా
మలచుకో" నా మాటలు శ్రద్ధగా వింటున్నాడు—— రవీంద్ర.

( 25–5–81 తేదీన ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంనుండి ప్రసారం